సాక్షి
మహబూబాబాద్

శనివారం | 28 | డిసెంబర్ | 2024

మంచు దుప్పటి..

గూడూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం మంచు కురుసింది. తెల్లవారు జాము నుంచి ఉదయం 9 గంటల వరకు జాతీయ రహదారిపై భారీగా మంచు కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు.

- గూడూరు


గూడూరులో కురుస్తున్న మంచు

న్యూస్‌రీల్

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



మహబూబాబాద్ రూరల్: భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ భౌతికకాయానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డితో కలిసి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ శుక్రవారం ఢిల్లీలో నివాళులర్పించారు. వారితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి



మహబూబాబాద్: సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెతోనైన ప్రభుత్వం స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. సమ్మెకు సీపీఐ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వీరన్న, భవానీ, నీలిమా, నవీన్, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను



మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని రద్దు చేసేంత వరకు పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులు పైచదువులకు దూరమవుతున్నారన్నారు. బాలికలకు విద్య మరింత దిగజారి బాల్య వివాహాలు పెరుగుతాయన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రతి పరిశోధక విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫెలోషిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, ఉపాధ్యక్షుడు బుర వీరభద్రం, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న వారాంతపుసెలవు (శనివారం), 29న ఆదివారం, 30న(సోమవారం) అమావాస్య సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా చదవాలి



నెల్లికుదురు: లక్ష్యానికి అనుగుణంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డీఈఓ రవీందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మండల కేంద్రానికి చెందిన యాదవరెడ్డి సహకారంతో అందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఎంఈఓ రాందాస్‌తో కలిసి 10వ తరగతి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ సహాయంతో రానున్న పరీక్షల్లో జిల్లా మొదటిస్థానంలో నిలిచేలా చదవాలన్నారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి 10/10 సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎఫ్ఎఓ మహంకాళి బుచ్చయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణచందర్, రిసోర్స్‌పర్సన్ సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి.. పిల్ల.. ఓ మగపులి

నల్లబెల్లి, కొత్తగూడ మండలాల్లో సంచారం

- భయం గుప్పిట్లో రెండు మండలాల జనం
- పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో ఆడపులి, పులి పిల్ల.. కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కోనాపురంలో మగపులి పాదముద్రలు
- వ్యవసాయ పనులకు వెళ్లని రైతులు, కూలీలు

నల్లబెల్లి/కొత్తగూడ: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామాల శివారులో, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కోనాపురం అటవీప్రాంతంలో పులుల సంచారం వార్త కలకలం రేపుతోంది. ఈ రెండు మండలాల్లో ఓ ఆడ పులి, పిల్ల పులి, మరో మగ పులి సంచారం నిర్ధారణ కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మల్లబోయిన కొమురయ్య రోజు మాదిరిగానే గురువారం తనకున్న 150 మేకలను పెద్దలొద్ది అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లాడు. అడవి జంతువును తింటున్న పెద్ద పులిని చూసి మేకలు, కుక్క భయపడి బెదిరి చెల్లాచెదురయ్యాయి. పెద్దలొద్ది అవతలి ఒడ్డున పెద్దపులి కనిపించడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కొమురయ్య వెనుదిరిగాడు.




అధికారులు సేకరించిన తల్లిపులి, పిల్లపులి, మగపులి అడుగులు

పులి తిరుగుతోంది... జాగ్రత్త

గ్రామాల్లో పోలీసుల దండోరా

నల్లబెల్లి మండలంలో పెద్ద పులుల సంచారంతో పోలీస్ అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు. 'పంట పొలాల్లో పెద్ద పులుల సంచారం ఉంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. రెండు రోజుల వరకు రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లొద్దు.. రాత్రి వేళ ఒంటరిగా వెళ్లొద్దు.. ఒక వేళ పెద్దపులులు కనిపిస్తే పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.. పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు అమర్చవద్దు' అని సూచిస్తున్నారు.


కొత్తగూడ మండలం కోనాపురంలో పులి పాదముద్రలను సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పొలాలనుంచి వెనుదిరిగిన రైతులు

నల్లబెల్లి మండలంలోని వ్యవసాయ పొలాల వద్ద పులి పాదముద్రలను గుర్తించిన రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన నర్సంపేట ఎఫ్ఆర్ఓ రవికిరణ్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం గ్రామాలను సందర్శించారు. అటవీ ప్రాంతం, పంట పొలాల్లో గాలింపు చేపట్టారు. కొండాపూర్ పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో ఆడపులి, పులిపిల్ల పాదముద్రలు ఉండగా, కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం గ్రామాల్లోని పంట పొలాల్లో, కొత్తగూడ మండలం కోనాపురం ముసలిమడు గు అటవీ ప్రాంతంలోని పొలాల్లో మగపులి పాదముద్రలను సేకరించారు. చివరగా ఆడపులి తన పిల్లతోపాటు, మగపులి కోనాపూర్ అటవీప్రాంతానికి వేర్వేరుగా వెళ్లినట్లు చెబుతు న్నారు. వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, కూలీలు పెద్దపులుల సంచారం విషయం తెలియడంతో పనులు చేయలేమని వెనుదిరుగుతున్నారు. కూలీల భయాన్ని అర్థం చేసుకున్న రైతులు చేసేదేమిలేక మిన్నకుండిపోతున్నారు.


అసంపూర్తి ఇళ్ల సంగతేంటి

నిర్మాణం మధ్యలో వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు


- పిల్లర్లు, గోడలకే పరిమితం
- వాటిని పూర్తి చేయడంపై అనుమానాలు
- ఇంటి స్థలం లేని పేదలకు ఇస్తేనే మేలు

పందులు, కుక్కలకు ఆవాసాలుగా..

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు వివిధ కారణాలతో మధ్యలోనే ఆగిపోయాయి. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏడాది కాలంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల గురించి పట్టించుకోలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా బేస్‌మెంట్ లెవల్, రెంటల్ లెవల్, స్లాబ్ లెవల్, ప్లాస్టింగ్ స్టేజీ ఇలా వివిధ దశల్లో 2,642 ఇళ్లు నిర్మించకుండా ఆగిపోయాయి. ఈ ఇళ్లు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించడంతో ఆ స్థలం ఇతర ప్రభుత్వ అవసరాలకోసం వినియోగించే అవకాశం లేకుండా పోయింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్లల్లో పందులు, కుక్కలకు ఆవాసాలు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. 2014కు ముందు జిల్లాలో రెండు విడతలుగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో 1,500లకు పైగా సగం బిల్లులు మాత్రమే వచ్చినట్లు సమాచారం. దీంతో నిరుపేదలు మొండిగోడలపై రేకులు, పెంకులు వేసుకొని ఉన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్న లబ్ధిదారులకు కొత్త ఇల్లు మంజూరు లేదని చెబుతున్న అధికారులు పాత ఇళ్లకు పెండింగ్ బిల్లులు ఇచ్చే విషయం చెప్పడంలేదు.




తొర్రూరులో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు



సాక్షి, మహబూబాబాద్: ఒకవైపు జిల్లాలో ఇల్లులేని నిరుపేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కోసం సర్వే జరుగుతోంది. గత ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే వదిలేసిన ఇళ్ల పరిస్థితి ఏంటని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రెండవ విడత 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అందాల్సిన బిల్లుల పరిస్థితి ఏమిటనేది చర్చగా మారింది. ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారు కానీ.. అసలు స్థలం లేని వారి పరిస్థితి ఏమిటని పేదలు అడుగుతున్నారు. అయితే కొత్త ఇళ్ల మంజూరుపై స్పష్టత ఉందని, పాత వాటి విషయంపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందని అధికారులు చెబుతున్నారు.

సగం ఇళ్లే పూర్తి

పేదలకోసం నిర్మించిన 'డబుల్' ఇళ్లు పంపిణీ చేయకపోవడంతో వాటిలో తుమ్మలు, పిచ్చిమొక్కలు మొలచి అడవిని తలపిస్తున్నాయి. గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల పైచిలుకు నిధులతో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించేందుకు జిల్లాకు రూ.287.24కోట్లు కేటాయించారు. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 5,415 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాల్సి ఉంది. అయితే ఇందులో ఇప్పటివరకు 2,773 ఇళ్లు పూర్తికాగా..1,798 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించారు. ఇందులో 1,728 కుటుంబాలు ఇళ్లకి చేరగా 975 ఇళ్లు నిర్మాణం పూర్తి అయినా నిరుపయోగంగానే ఉన్నాయి.

ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ ఇళ్లు, కాంగ్రెస్ పాలనలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. అయితే ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు పెండింగ్ బిల్లుల వివరాలు ఉన్నతాధికారులు తెప్పించుకున్నట్లు సమాచారం. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో పాత ఇళ్లు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించి నిరుపేదలకు ఇళ్లు పంపిణీ చేస్తే ప్రభుత్వ ధనం వృథా కాకుండా ఉండటంతోపాటు నిరుపేదలకు నీడ కల్పించిన వారు అవుతారని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేసి పేదలకివ్వాలి..



గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టి సగం వరకు పూర్తి చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లు.. ఈ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి చేయాలి. అర్హులైన పేదలకు కేటాయించాలి. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తయితే తమకు సొంత గూడు వస్తుందని వేలాది కుటుంబాలు ఆశగా ఉన్నాయి. వారి సొంతింటి కలను నిజం చేయాలి.

- దుడ్డెల రామ్మూర్తి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రత్యేక నిధులు కేటాయించాలి..



అసంపూర్తి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి చేయాలి. ఇంటి స్థలం కూడా లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి. పేదలకు నిలువ నీడ కల్పించడంలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలి. నిజమైన లబ్ధిదారులకే ఇళ్లు చెందాలి.

- మంగళంపల్లి రాజ్‌కుమార్, మహబూబాబాద్

అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలి..



గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టిందే నిరుపేదలకు నిలువ నీడ కల్పించేందుకు. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు ఇళ్లు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు నిర్మించిన ఇళ్లు వారికే కేటాయించాలి. లేదంటే ఆందోళనలు చేస్తాం.

- గుగ్గిళ్ల పీరయ్య, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు

ప్రమాదాలపై అవగాహన ఉండాలి

- ఎన్‌డీఆర్‌ఎఫ్ సీఐ గౌతమ్

మహబూబాబాద్: ప్రతీఒక్కరికి ప్రమాదాలపై అవగాహన ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ సీఐ గౌతమ్ అన్నారు. జిల్లా కేంద్రం శివారు కంబాలచెరువులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన 10వ ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్ సిబ్బందికి ప్రమాదాలపై శిక్షణ (మాక్ డ్రిల్) ఇచ్చారు. చెరువులో మునిగిన వ్యక్తులను ఎలా కాపాడాలనే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ గౌతమ్ మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు ఈ శిక్షణలో నేర్చుకున్న పద్ధతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈత నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి వీరన్న, బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


సూచనలు ఇస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సీఐ గౌతమ్


చెరువులో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజీపీగా సునీత



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివి ల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు (ఏజీపీ)గా తాటిపాముల సునీతను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన రాష్ట్ర న్యాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సునీత పదేళ్ల నుంచి న్యాయవాదిగా మహబూబాబాద్ కోర్టులో పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆమెను ఏజీపీగా నియామకం చేయగా మూడేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. మహబూబాబాద్ జిల్లాగా ఏర్పడిన అనంతరం మొదటిసారిగా ఏజీపీగా సునీత నియామకం కావడంతో జిల్లా కోర్టులో మహిళకు దక్కిన అరుదైన గౌరవంగా చెప్పవచ్చు.



తెలంగాణ ప్రజల చూపంతా ఇప్పుడు గ్రేటర్ వరంగల్‌పైనే. రోడ్లు, రైలు మార్గాలైనా.. విమానయానమైనా, హెల్త్ హబ్‌గా పేరొందాలన్నా.. నియో మెట్రోస్టేషన్ ఏర్పాటు చేయాలన్నా.. రాష్ట్ర రాజధాని తర్వాత వరంగల్‌కే స్కోప్ ఎక్కువ. నిధుల కొరత ఒక వైపు ఉన్నా.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు ఈ ఏడాది(2024)లో కొంత కదలిక వచ్చింది. పలు ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. ఈ ఏడాది నగరంలో జరిగిన అభివృద్ధి, కొనసాగుతున్న పనులపై 'సాక్షి' మననం.

- వివరాలు 10లో▸

పరిహారం చెల్లింపులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సురేష్
- హిట్ అండ్ రన్ కేసుల పురోగతిపై చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సురేశ్

మహబూబాబాద్ రూరల్: గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఎవరైన మృతి చెందినప్పుడు రావాల్సిన పరిహారం చెల్లింపుల అంశాన్ని బాధిత కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సురేశ్ అన్నారు. హిట్ అండ్ రన్ కేసుల పురోగతిపై మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సురేష్ మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కన్వీనర్‌గా, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సభ్యులుగా ఉండే కమిటీ తమ అధ్యక్షతన ప్రతీ రెండు నెలలకు ఒకసారి సమావేశమై హిట్ అండ్ రన్ కేసుల విషయంలోని పురోగతిపై చర్చిస్తారన్నారు. సమావేశం అనంతరం నివేదికను హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి పంపిస్తామన్నారు. గుర్తుతెలియని వాహనాలు ఢీకొని చనిపోయిన వ్యక్తుల సంబంధీకులు పోలీసులను సంప్రదిస్తే ప్రథమ సమాచార నివేదికతోపాటు బాధితుడి వివరాలను రెవెన్యూ డివిజన్ అధికారులకు పంపిస్తారన్నారు. అక్కడి నుంచి కలెక్టర్ పరిశీలించి బాధితుడి తరపు వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున వచ్చే రూ.2లక్షల నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. బాధితుల తరుపు బంధువులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ విషయంపై అవగాహన ఉన్నవారు ఇతరులకు చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి తిరుపతిరావు, మహబూబాబాద్, తొర్రూర్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి


- ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ అధ్యక్షుడు రామయ్య


మాట్లాడుతున్న పార్నంది రామయ్య

మహబూబాబాద్ అర్బన్: గెజిటెడ్ హెచ్‌ఎంపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ అధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని శనిగపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య హాజరై మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం, దళితుడు కంబాలి రాములపై మతోన్మాద మూకలు భక్తి ముసుగువేసుకొని ఉద్దేశపూర్వకంగా దాడి చేశారన్నారు. వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరవత్ బద్రినాయక్, నాయకులు మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్


మాట్లాడుతున్న కుంట ఉపేందర్

మహబూబాబాద్ రూరల్: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది డిమాండ్లు నేరవేర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం టోకెన్ సమ్మె చేపట్టారు. ముందుగా మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కుంట ఉపేందర్, పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కేటగిరీల వారీగా వేతనాలను పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే జనవరి 4వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీపీ యూనియన్ జిల్లా నాయకుడు యాలాద్రి, వీరన్న, శౌరి, సురేష్, మల్సూర్, ఐలయ్య, మల్లయ్య, సువర్ణ, మంగమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తొర్రూరు: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం ఎదుట పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాడ్య భీకు, మండల అధ్యక్షుడు సోమనర్సయ్య, నాయకులు యాకయ్య, రాము, వెంకట్, నర్సయ్య, మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పాపం పసికందు..

- రైలులో బాలుడిని వదిలివెళ్లిన మహిళ
- డయల్ 100కు కాల్ చేసి సమాచారమిచ్చిన ప్రయాణికులు
- చేరదీసి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించిన కాజీపేట జీఆర్ పోలీసులు


రైలులో మహిళ వదిలి వెళ్లిన బాలుడు

కాజీపేట రూరల్ : పాపం పసికందు. భారమనుకుందో? లేదా అపహరిస్తుందో తెలియదుకాని ఓ మహిళ.. బాలుడిని రైలులో వదిలేసి వెళ్లింది. దీంతో ఆ బాలుడు వెక్కివెక్కి ఏడ్చుకుంటూ ఆమె కోసం రైలులోనే తిరుగుతుండగా ప్రయాణికులు గుర్తించారు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించగా కాజీపేట జీఆర్ పోలీసులు చేరదీసి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌సోల్– నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ రెండు, మూడు సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ బాలుడిని జనరల్ బోగీలో వదిలి వెళ్లిపోయింది. ఆమె కోసం బోగీలో అమాయకంగా తిరుగుతున్న బాలుడిని గుర్తించిన ప్రయాణికులు.. డయల్ 100కు కాల్ చేశారు. పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది కాజీపేట జీఆర్పీ పోలీసులను అప్రమత్తం చేశారు. రైలు కాజీపేట జంక్షన్‌కు చేరుకోగా బోగీలో నుంచి బాలుడిని చేరదీసి చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ సిబ్బందికి అప్పగించారు. కాగా, బాలుడిని వదిలివెళ్లిన మహిళ బాలుడి తల్లేనా? లేదా బాలుడిని తరలిస్తుందానే కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు. బాలుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే కాజీపేట జీఆర్పీ ఎస్‌హెచ్‌ఓ 8712658609, 9490027342 సెల్ నంబర్లలో సంప్రదించాలని కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కోరారు.

చోరీలకు పాల్పడిన నిందితురాలి అరెస్ట్

- 171.23 గ్రాముల బంగారం, ఒక కారు స్వాధీనం

జనగామ రూరల్: రద్దీ ప్రదేశాల్లో దృష్టి మరల్చి పలువురి మహిళల నుంచి ఆభరణాలు అపహరిస్తున్న నిందితురాలిని జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 13 లక్షల విలువైన 171.23 గ్రాముల బంగారం, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ పి.దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. జనగామకు చెందిన చొల్లేటి నివేదిత అక్టోబర్ 6వ తేదీన ఆర్టీసీ బస్సులో కాజీపేట నుంచి జనగామ వస్తోంది. ఈ క్రమంలో నిందితురాలు ఏపీలోని కర్నూల్ జిల్లా బుదారిపేటకు చెందిన అక్షింతల సంధ్య హైదరాబాద్ వెళ్లడానికి స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇదే బస్సు ఎక్కి నివేదిత పక్కన కూర్చుంది. మాటల్లో దింపి నివేదిక వద్ద ఉన్న బంగారు ఆభరణాలు భద్రపరిచిన బ్యాగును అపహరించింది. జనగామ బస్టాండ్‌లో దిగిన నివేదిత ఇంటికి వెళ్లిన అనంతరం మరో బ్యాగును చూడగా అందులో ఆభరణాలు భద్రపరిచిన బ్యాగు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ జనగామ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఏసీబీ పార్థసారథి పర్యవేక్షణలో చేపట్టారు. ఈ క్రమంలో సీఐ పి. దామోదర్ రెడ్డి, ఎస్సై భరత్ గురువారం మధ్యాహ్నం పెంబర్తి వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఓ కారు పోలీసులను చూసి కొద్ది దూరంలో ఆపి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులకు అనుమానం వచ్చి విచారించారు. బస్సులో ఆభరణాలు ఉన్న బ్యాగును అపహరించింది తానేనని సంధ్య ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని అరెస్ట్ చేసి రూ. 13 లక్షల విలువైన 171.23 గ్రాముల బంగారం, ఒక కారు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సీఐ దామోదర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడు. కాగా, కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ పి. దామోదర్ రెడ్డి , ఎస్సై భరత్, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ అభినందించారు.

రైజింగ్.. సిటీ!

ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులతో వరంగల్ నగరానికి న్యూ లుక్..

- గ్రేటర్ పరిధిలో పలు అభివృద్ధి పనులు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో మెడికల్ హబ్
- అయోధ్యపురంలో వందేభారత్‌తో సహా అన్ని రైల్వే కోచ్‌ల తయారీ
- తిరుమాడ వీధులతో భద్రకాళికి కొత్త రూపు
- కళామతల్లి సిగలో కాళోజీ కళాక్షేత్రం



గ్రేటర్ వరంగల్ మహానగరం కొత్త లుక్ సంతరించుకుంటోంది. రాష్ట్ర రాజధానికి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ నగరం 406 కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలో రెండో అతిపెద్దది. రాష్ట్రానికి రెండో రాజధాని అయ్యేందుకు అన్ని అర్హతలుండడం, భవిష్యత్ అవసరాల దృష్ట్యా అన్ని హంగులు సమకూరుతున్నాయి. కాకతీయులు నిర్మించిన కోటలు, సరస్సులు, దేవాలయలతో ప్రసిద్ధ పర్యాటక ఆకర్షణ నగరంగా గుర్తింపు పొందగా ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులతో సరికొత్తనగరంగా రూపుదిద్దుకుంటోంది. నగరంలో ఈ ఏడాది(2024)కొనసాగుతున్న ముఖ్యమైన అభివృద్ధి పనుల ఏఐ (నమూనా) చిత్రాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

– వరంగల్ డెస్క్

విమానయానం

మరికొద్ది రోజుల్లో నగరం నుంచి విమానాలు ఎగరనున్నాయి. కేంద్రం ఉడాన్ (ఉడో దేశ్ కీ ఆమ్ నాగరిక్) పథకం కింద మామునూరు విమానాశ్రయాన్ని 2022 సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. వరంగల్ శివారులోని మామునూరులో నిజాం కాలంనాటి ఎయిర్ స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1,400 మీటర్ల పొడవైన రన్ వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్ వే ఉంది. ఆ పాత ఎయిర్ స్ట్రిప్‌నకు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధీనంలో ఉంది. మిగతా భూసేకరణకు కూడా రైతులు అంగీకరించారు. ఎయిర్‌పోర్టు పూర్తయితే 50 నుంచి 186 మంది ప్రయాణించేలా వీలున్న 37.6 మీటర్లు (123 ఫీట్లు) పొడవనున్న ఏ 320, బీ–737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ చకచకా..

కాజీపేట అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు మంజూరు చేసింది. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఇక్కడ వందే భారత్‌తో సహా అన్ని రకాల రైల్వేకోచ్‌లు తయారుకానున్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10వేల మందికి ఉపాధి లభించనుంది.

భళా.. కాళోజీ కళాక్షేత్రం

హనుమకొండ బాలసముద్రంలోని సర్వే నంబర్ 1066 'కుడా' (హయగ్రీవాచారి కాంపౌండ్) భూమిలో 4.20 ఎకరాల్లో పూర్తి సెంట్రలైజ్డ్ ఏసీతో అత్యాధునిక ఆడియో, విజువల్ సిస్టమ్‌లతో సాంస్కృతిక కార్యక్రమాలు, థియేటర్ ప్రదర్శనలు, ప్రొజెక్టర్, ప్రీ–ఫంక్షన్ లాబీ, ఆట్రియంలు, ల్యాండ్ స్కేపింగ్, వీధి దీపాలు, ఫౌంటెన్లతో నిర్మించారు. చిన్నపాటి సాంస్కృతిక సమావేశాల కోసం ప్రత్యేకంగా నాలుగు మినీ హాళ్లు అందుబాటులో ఉన్నాయి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో కాళోజీ నారాయణరావు ఫొటోలు, జ్ఞాపకాలు, పురస్కారాలు వంటి అంశాలు ప్రదర్శిస్తారు. వీల్ చైర్స్ కోసం ప్రత్యేకంగా ర్యాంప్ నిర్మించారు. రాజసం ఉట్టిపడేలా చేపట్టిన నిర్మాణం ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కన్నా పెద్దదిగా చెప్పవచ్చు.

తల్లీ.. భద్రకాళి

నగరంలోని భద్రకాళి దేవాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణంలో భాగంగా చెరువును 60 అడుగులు ముందుకు జరపాల్సి ఉంది. దీంతోపాటు చెరువు ఆధునికీకరణ చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటికే చెరువులోని నీటిని ఖాళీ చేశారు. పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. ఆలయం చుట్టూ నిర్మించే మాడ వీధుల నిర్మాణంలో భాగంగా ఆలయానికి ప్రాకారం నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాకారానికి నాలుగు దిశల్లో నాలుగు ద్వారాలు ఏర్పాటుచేసి వాటికి గోపురాలు నిర్మించనున్నారు. ఉత్తరం వైపున ఉన్న వేదపాఠశాలనుంచి ప్రస్తుతమున్న ప్రధాన గేటు తూర్పు వైపుగా ఏర్పాటు చేయనున్నారు. అమ్మవారికి ఎదురుగా రాజగోపురం 120 అడుగుల ఎత్తు.. 9 అంతస్తులతో నిర్మించనున్నారు. ఒక్క రాజగోపురానికే రూ.20 కోట్లు ఖర్చవుతాయని అంచనా.

వరంగల్ ఆర్టీసీ బస్టాండ్.. నియో మెట్రో స్టేషన్

వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణకు సుమారు నాలుగు దశాబ్దాల తరువాత ముహూర్తం కుదిరింది. 1984లో ఈ బస్టాండ్‌ను ప్రారంభించగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక హంగులతో నిర్మించతలపెట్టారు. ఈ మేరకు పాత బస్టాండ్‌ను కూల్చివేశారు. రైల్వేస్టేషన్ పక్కనే ఉండడంతో నియో మెట్రో రైల్వేస్టేషన్ వచ్చేలానిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) సుమారు రూ.73.50 కోట్లతో ప్రాథమిక అంచనాలు రూపొందించి.. జీప్లస్5 భవనం చేపట్టాలని నిర్ణయించారు. భూగర్భంలో రెండు పార్కింగ్ కేంద్రాలు, ఆర్టీసీ కార్యాలయం, వాణిజ్య దుకాణాలు, బాంక్వెట్‌హాల్, మల్టీప్లెక్స్, హోటల్, రెస్టారెంట్ ఉండేలా రూపొందించారు. ఒకేసారి 35 బస్సుల వరకు నిలిపి ఉంచేలా ప్లాట్‌ఫామ్‌లు డిజైన్ చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. పూర్తయితే వరంగల్ పరిధి రూపురేఖలు మారిపోనున్నాయి.

కాజీపేట జంక్షన్ రీమోడలింగ్

కాజీపేట జంక్షన్‌ను అమృత్‌భారత్ పథకంలో భాగంగా కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్‌లో పోర్టికో, ప్రయాణికుల అప్పర్‌క్లాస్ వెయిటింగ్ హాల్ నిర్మాణం, ప్లాట్‌ఫాంల విస్తరణ, న్యూ టాయిలెట్స్ బ్లాక్, రైల్వే అధికారుల కార్యాలయాలు, గ్రీన్ గార్డెన్, రోడ్లు, పాత్‌వే, పార్కింగ్, సర్క్యులేషన్ ఏరియా స్మూత్ ట్రాఫిక్ ఫ్లో, రెండు లిఫ్టులు, 3 ఎస్కలేటర్లు, ప్యాసింజర్ ఫ్రెండ్లీ సైన్ బోర్డులు, నూతన నిర్మాణాలు, రైలు కోచ్‌తో రెస్టారెంట్ హోటల్, కమర్షియల్ డెవలప్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. వంద ఏళ్ల కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి అదే స్థలంలో నూతనంగా మోడల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. అన్ని విధాలా రెనోవేషన్ పనులు పూర్తయితే కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్ రైల్వే స్టేషన్‌గా చూడవచ్చు.

24 అంతస్తులు.. 2 వేల పడకలు

వరంగల్ నగరం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో సెంట్రల్ జైలు ప్రాంగణంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. మొదట్లో రూ.1,150 కోట్లతో 24 అంతస్తులు, 2వేల పడకలతో నిర్మాణం చేపట్టారు. 24 అంతస్తుల్లో 8 క్లినికల్ విభాగానికి, 3 అంతస్తులు అడ్మినిస్ట్రేషన్ విభాగానికి, మిగతా అంతస్తులు మెడికల్ ఎడ్యుకేషన్ ఉపయోగించే విధంగా నిర్మాణం చేపట్టారు. రూ.1,150 కోట్ల ఆస్పత్రి వ్యయాన్ని సదరు నిర్మాణ ఏజెన్సీ రూ. 1,750 కోట్లకు పెంచింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి పనులపై సమీక్షించింది. సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆస్పత్రి పనులకు కొంత ఆటంకం కలుగుతోంది. ఏదిఏమైనా నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు పొందొచ్చు.

ఓరుగల్లులో సంస్కరణల సారథి

- 1992లో నిర్వహించిన కేయూ స్నాతకోత్సవానికి మన్మోహన్‌సింగ్


కేయూ స్నాతకోత్సవంలో అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ మన్మోహన్‌సింగ్, గవర్నర్ కృష్ణకాంత్, వీసీ జయశంకర్. కార్యక్రమానికి వస్తున్న మన్మోహన్.

కేయూ క్యాంపస్ : 1992లో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆర్థిక సంస్కరణల సారథి డాక్టర్ మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు. అప్పటి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కొత్తపెల్లి జయశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సమయంలో కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నడాక్టర్ మన్మోహన్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ ఆర్‌ఈసీ (ప్రస్తుత నిట్) ఆడిటోరియంలో కేయూ స్నాతకోత్సవం నిర్వహించారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్‌తో కలిసి పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ ప్రదానం కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ పాల్గొన్నారు. ప్రముఖ కవి దివంగత కాళోజీనారాయణరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు దివంగత నేరేళ్ల వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. మన్మోహన్‌సింగ్ 2004నుంచి 2014వరకు భారత ప్రధానిగా పదేళ్లపాటుసేవలు అందించారు. అంతకంటే ముందు అనేక పదవులు నిర్వర్తించారు. ఈనెల 26న రాత్రి మన్మోహన్ సింగ్ తుదిశ్వాసవిడిచిన విషయం విధితమే.

వికటించిన హెర్బల్ మందు..

- చికిత్స పొందుతూ మహిళ మృతి


యాదలక్ష్మి(ఫైల్)

చెన్నారావుపేట: హెర్బల్ మందు వాడగా వికటించడంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మహిళ శుక్రవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బోజేర్వుకు చెందిన మిరాల మల్లయ్య, రాజమ్మ దంపతుల కూతురు యాదలక్ష్మి(40) భర్తతో విడిపోయి కుమారుడు వెంకటేశ్‌తో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. వైద్యుల సలహా మేరకు అల్లోపతి వైద్యం పొందుతోంది. ఈ నెల 16వ తేదీన వరంగల్‌కు చెందిన క విత వద్ద రూ. 3 వేలు చెల్లించి హెర్బల్ మందు కొనుగోలు చేసి మూడు రోజులు వాడింది. 19న అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు గమనించి ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. యాదలక్ష్మి మృతితో కుమారుడు వెంకటేశ్ గుండెలవిసేలా రోదించాడు. తల్లి మృతితో ఒంటరయ్యాడు. మృతురాలి సోదరుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరాడంబరంగా సీఎం కప్ పోటీలు


హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న ఆదిలాబాద్, మెదక్ బాలుర జట్లు


హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న మెదక్, మహబూబ్‌నగర్ బాలికల జట్లు

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐదు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు శుక్రవారం నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి క్రీడాలోకం సంతాపం తెలియజేసింది. క్రీడలు ప్రారంభించే ముందు అధికారులు, క్రీడాకారులు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు రెండు నిమిషాలు మౌనం పాటించి మాజీ ప్రధాని మన్మోహన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్టేడియంలోని వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ మైదానాల్లో సెపక్‌తక్రా నిర్వహించగా హ్యాండ్‌బాల్ గ్రౌండ్‌లో హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగినట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన భూవివాదం..

- దారి అటకాయించి కర్రతో కొట్టి వృద్ధుడి హత్య
- కాటారం మండల కేంద్రంలో ఘటన


బుచ్చయ్య (ఫైల్)

కాటారం: భూ వివాదాలు నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. రైతు కుటుంబాల్లో సంతోషాన్ని నింపే నేలలు.. వివాదాస్పదంగా మారి రక్తపు మడుగులతో అదే రైతు కుటుంబాల్లో విషాదాలకు దారితీస్తున్నాయి. కొన్నేళ్లుగా భూమి హద్దుల విషయంలో నెలకొన్న గొడవలతో ఓ వృద్ధుడిని దారి అటకాయించి హత్య చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఇప్పలగూడేనికి చెందిన డొంగిరి బుచ్చయ్య(65)కు కాటారం శివారులోని సర్వే నంబర్ 501లో 1.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి హద్దుల విషయంలో సొదారి పోచయ్య, అతడి కుమారులు సమ్మయ్య, అంకయ్య, లింగయ్య, మృతుడు బుచ్చయ్య మధ్య మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా పరిష్కారం కాకపోవడంతో బుచ్చయ్య గత మే నెలలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు కొనసాగుతోంది. కాగా, ఇదే విషయంలో బుచ్చయ్య శుక్రవారం ఉదయం భూమి వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో బుచ్చయ్యకు సొదారి లింగయ్య అతడి భార్య శోభ మధ్య వాగ్వాదం నెలకొంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో బుచ్చయ్య తన భార్య సారమ్మకు ఫోన్‌లో విషయం తెలిపి అక్కడి నుంచి బయలుదేరాడు. దాడి విషయం లింగయ్య తన కుమారుడు పవన్‌కు సమాచారం అందించాడు. ఆవేశానికి గురైన పవన్ ఇప్పలగూడెంలోని హనుమాన్ టెంపుల్ వద్ద బుచ్చయ్య బైక్‌పై వెళ్తున్న క్రమంలో అటకాయించి కర్రతో కొట్టడంతో కిందపడ్డాడు. దీంతో పవన్ వెంటనే బుచ్చయ్య తలపై విచక్షణారహితంగా కొట్టడంతో మృతిచెందాడు. ఈ క్రమంలో మృతుడి భార్య సారమ్మ, కూతుళ్లు దుర్గం సుగంధ, జాడి శోభ పొలం వద్దకు వెళ్తూ బుచ్చయ్యపై దాడి జరగడాన్ని గమనించి అక్కడికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. హత్యకు పాల్పడిన పవన్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న కాటారం సీఐ నాగార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దీక్షాంత్ పరేడ్ రద్దు..


తల్లికి టోపి పెడుతున్న కుమారుడు


భార్యకు టోపి పెడుతున్న కానిస్టేబుల్


తల్లికి పాదాభివందనం చేస్తున్న కానిస్టేబుల్


తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటూ..


తనకు కాబోయే భార్య పావనికి సెల్యూట్ చేస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన రాజశేఖర్

మాజీ ప్రధాని మన్మోహన్ మృతితో పరేడ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ

- నిరుత్సాహంతో వెనుదిరిగిన స్పెషల్ కానిస్టేబుళ్ల బంధువులు

మామునూరు : ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో శుక్రవారం జరగాల్సిన 457 మంది స్పెషల్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) రద్దుయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ దీక్షాంత్ పరేడ్ రద్దు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ టీజీ ఎస్పీ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీక్షాంత్ పరేడ్ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కామాండెంట్ రాంప్రకాశ్ వెల్లడించారు. కాగా, కానిస్టేబుళ్ల బంధువులు, స్నేహితులు ఉదయమే పరేడ్ ప్రాంగణానికి చేరారు. దీంతో కానిస్టేబుళ్లు.. బంధువులను కలిసి ముచ్చటిస్తూ ఆనందంలో మునిగితేలారు. మరో కొద్ది నిమిషాల్లో బాధ్యతలు చేపడతామనుకునే సమయంలో పరేడ్ రద్దయిందని తెలియడంతో ఆ క్షణం వరకు ఆనందంగా ఉన్న కానిస్టేబుళ్లు, వారి బంధువులు ఒక్కసారి నిరుత్సాహానికి గురయ్యారు. దీంతో చేసేది ఏమీలేక కానిస్టేబుళ్లు తమ కుటుంబ సభ్యులు, బంధువులతో ఫొటోలు దిగుతూ గడిపారు. కుటుంబీకులు, బంధువులు కొద్ది సమయం సేదదీరిన అనంతరం వెనుదిరిగారు.